ప్రజాశక్తి
సోమవారం 23 డిసెంబర్ 2024
5
కర్నూలు

మాట్లాడుతున్న నాయకులు

ఉపాధి పనులేవి..?

పనులు లేక కూలీల వలస బాట

ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు

100 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు..?

జిల్లాలో ఉపాధి హామీ పనులు ముందుకు సాగడం లేదు. క్షేత్రస్థాయిలో పనులను పెట్టేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లపై అధికార పార్టీ కూటమి నేతలు రాజకీయ వేధింపులు పెడుతున్నారు. ఉపాధి పనులు లేకపోవడంతో కూలీలు పనుల కోసం వలసలు వెళ్లేందుకు సన్నద్ధమయ్యారు.

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో మొత్తం ఉపాధి హామీ పథకం కింద 6,13,620 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలకు 99 లక్షల పని దినాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు కేవలం 55 లక్షల పది దినాలు మాత్రమే కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా మూడు నెలలు గడువున్నప్పటికీ సగం శాతం కూడా పూర్తి కాకపోవడం గమనార్హం. ఉపాధి హామీ పథకాన్ని గ్రామస్థాయిలో అమలు చేసేది ఫీల్డ్ అసిస్టెంట్లే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామస్థాయిలో ఉపాధి హామీలో పని చేస్తున్నటువంటి ఫీల్డ్ అసిస్టెంట్లపై దృష్టి సారించారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు అధికార పార్టీ నేతలు బెదిరింపులకు గురి చేస్తుండడంతో పనులు పెట్టేందుకు ముందుకు రావడం లేదు. కొంతమంది అధికార పార్టీ నేతల వత్తిడిలకు తట్టుకోలేక స్వచ్ఛందంగా రాజీనామా చేసి వెళ్తున్నారు. మరి కొంతమంది పై అవినీతి అక్రమాల పేరుతో తప్పుడు నివేదికలను సృష్టించి వారిని అక్రమంగా తొలగించేందుకు ఎంపిడిఒల ద్వారా జిల్లా స్థాయి ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు సిఫార్సు చేస్తున్నారు.

జిల్లాలో దాదాపుగా ఇప్పటికే వందమందికి పైగా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగింపుగాను అధికారులు అధికార పార్టీ నేతల సిఫార్సు మేరకు చర్యలు తీసుకుంటున్నారు. జనవరి ఫిబ్రవరి మాసంలో గ్రామాల్లో వ్యవసాయ పనులు పూర్తి కావడంతో పేదలు ఉపాధి పనులకు వెళ్లేందుకు సిద్ధమవుతారు. ఓర్వకల్ మండల పరిధిలో దాదాపుగా ఎనిమిది గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. ఈ మండలంలో ఉపాధి హామీ పనులు ముందుకు సాగడం లేదని కూడా ఇటీవల జిల్లా కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో సంబంధిత శాఖ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులు గ్రామాల్లో సక్రమంగా చేపట్టాలంటే ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులను నిరోధించి కూలీలకు పనులు కల్పించేందుకుగాను అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి పనులను కల్పించాలి

జిల్లాలో ఉపాధి హామీ పనులను కూలీలందరికీ కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులను నివారించాలి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లను అక్రమ తొలగింపులకు పాల్పడరాదు. ఇప్పటికే జిల్లా నుండి వలసలు ప్రారంభమవుతున్నాయి. జనవరిలో మరింత పెరిగే అవకాశం ఉంది. వలసల నివారణకు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పకడ్బందీగా పెట్టాలి.

- కెవి.నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం.

ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి

- ఎపి మున్సిపల్ టీచర్ల ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి-ఆదోని

ఆపిన ఉపాధ్యాయుల ప్రమోషన్ల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే మొదలు పెట్టాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్ ఫెడరేషన్ నాయకులు భాస్కర్ ,బసరాజులు పేర్కొన్నారు. ఆదివారం ఆదోనిలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఉపాధ్యాయుల ఫెడరేషన్ పట్టణ శాఖ ముఖ్య కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడారు మున్సిపల్ విద్యా వ్యవస్థలో గల అరకొర పోస్టుల పదోన్నతుల విషయంలో జిల్లా విద్యాశాఖ అధికారులు అవలంబించిన విధానాన్ని చూసి మున్సిపల్ ఉపాధ్యాయులు విస్తుపోయారన్నారు. ప్రమోషన్ వద్దని ఒక ఉపాధ్యాయుడు రీలింక్విష్‌మెంట్ ఇచ్చిన తర్వాత వెంటనే తదుపరి అర్హత గల సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతి ప్రక్రియలో అవకాశం కల్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్వహించిన పదోన్నతుల ప్రక్రియలో కేవలం 1:1 గా పిలవడంతో పాఠశాల సహాయకులు గణితం సబ్జెక్టులో ఇద్దరు ఉపాధ్యాయులు తమకు పదోన్నతి వద్దని రీలింక్విష్‌మెంట్ ఇచ్చారన్నారు. అధికారులు అర్హత గల తదుపరి సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతి అవకాశం కల్పించలేదన్నారు. భౌతిక శాస్త్ర పాఠశాల సహాయకుల పదోన్నతుల ప్రక్రియలో ముగ్గురు ఉపాధ్యాయులు తమకు పదోన్నతి వద్దని రీలింక్విష్‌మెంట్ ఇచ్చారని ఈ సబ్జెక్టులో కూడా అర్హత గల సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతి అవకాశం కల్పించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇతర జిల్లాల విద్యాశాఖ అధికారులు ఈ పదోన్నతుల ప్రక్రియలో అవలంబించిన విధానాన్ని పక్కన బెట్టి కేవలం ఒక్క కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్వహించిన ఈ ప్రత్యేకమైన విధానంతో పదోన్నతులు పొందేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. సీనియారిటీ విషయంలో కూడా వెనుకబడి పోతామని ఉపాధ్యాయులు అధికారుల వద్ద ఆందోళన వెలిబుచ్చారన్నారు. అయినప్పటికీ పదోన్నతుల ప్రక్రియ కొనసాగించక పోవడం ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క మీడియం పాఠశాల సహాయకుల పదోన్నతుల ప్రక్రియ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని విద్యాశాఖ అధికారులు నిర్వహించినప్పటికీ, కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం నిర్వహించ లేదన్నారు. దీంతో అర్హతగల అభ్యర్థులు పదోన్నతుల ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందని భావిస్తున్నా ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయంలో ఉన్నారన్నారు. ఉర్దూ మీడియం సాంఘిక శాస్త్రం పాఠశాల సహాయకుల పోస్టుకు అభ్యర్థులను ప్రకటించక పోవడం పట్ల అర్హత గల అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. సమావేశంలో కోటన్న, బడుగు బసవరాజు, ప్రతాప్‌రెడ్డి, సుధాకర్, సురేష్ కుమార్ వున్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

సివి రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిల్వర్‌జూబ్లీ కళాశాల సిబ్బంది

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్, రాయలసీమ యూనివర్సిటీలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో రిజిస్ట్రార్ కట్టవెంకటేశ్వర్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి సుబ్రహ్మణ్యకుమార్ సర్ సివి.రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయలసీమ వర్సిటీలో గణిత విభాగాధిపతి సుందరానందపుచ్చా రీసెర్చ్ డైరెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి లు సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ అని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో రైతుకు తీవ్ర నష్టం

- తడిచిన మిర్చి - పూత రాలిన పప్పుశెనగ

ప్రజాశక్తి - ఆలూరు

నియోజకవర్గంలో రబీలో పండించిన పంటలకు తుపాను ప్రభావంతో కురిసిన వర్షంతో చేతికొచ్చిన మిరప పంట, పప్పుశెనగ పైరు నేలపాలయింది. ఆదివారం తెల్లవారిజామున కురిసిన వర్షానికి ఆలూరు, హోళగుంద మండలంలో 8 నుండి 9 మి.లీ వర్షపాతం నమోదయింది. ఆస్పరి,దేవనకొండ మండలంలో చెదురు మధురు వర్షం కురిసింది. ఆలూరు మండలంలో కురిసిన వర్షానికి మానేకుర్తి, హులేబీడు,తుంబలబీడు, అరికేర, కురుకుంద, ముద్దనగేరి గ్రామలలో కలంలో ఆరబోసిన సుమారు 300 ఎకరాల మిరప పంట పూర్తిగా తడిసిపోయింది. ఈ సారి వర్షాలు బాగా కురవడంతో హోళగుంద మండలంలో 500ఎకరాలు పప్పు శనగ, ఆలూరు మండలంలో 16,900 ఎకరాలలో పప్పు శనగ పంటను సాగు చేసుకోగా,100 ఎకరాలలో వాము పూతదశలో ఉన్న పంటలకు అకాల వర్షంతో నాశనం అయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు కోత దశలో ఉన్న కంది, జొన్న, తదితర పంటలు నెలపాలై అపార నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు.

పూత రాలిపోయిన శనగ పంట

తడిసిపోయిన మిర్చి

ఐదెకరాల ఎకరాల పంట తడిసింది

మిరప పంటను రూ 3.50లక్షల పెట్టుబడితో 7ఎకరాలు సాగుచేసాను. మూడు రోజులుగా ఐదెకరాల మిరప పంటను తెంపి ఆరబోయగా రాత్రి తుఫాను ప్రభావంతో ఒక్కసారిగా వర్షం కురవడంతో పంటంతా నేలపాలయింది.

- హనుమంతు, రైతు మనేకుర్తి గ్రామం.

పూత దశలోనే శెనగ పంట నాశనం

రూ.2లక్షల పెట్టుబడితో 8ఎకరాలు పప్పు శెనగ పంట కౌలుకు సాగు చేస్తే వర్షం కారణంగా పూతదశలో ఉన్న పంటంతా నాశనం అయింది.కంది పంట ను 6ఎకరాలు సాగు చేసాను. కోతకు ముందే వర్షం వచ్చి కంది బుడ్డలు పగుళ్ళు వచ్చాయి. మొత్తం రూ.4లక్షల పెట్టుబడి నష్టపోయాను.

- లక్ష్మీకాంత్, రైతు మొలగవల్లి గ్రామం.

నేడు 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో సోమవారం నాడు 11 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిఆర్ఒ వెంకట్ నారాయణమ్మ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆదోని డివిజన్ లోని కోసగి మండలం లోని దొడ్డి గ్రామం, మంత్రాలయం మండలంలోని దిబ్బన దొడ్డి గ్రామం,పెద్దకడబూరు మండలంలోని చిన్న తుంబలం గ్రామం, ఆదోని మండలంలోని బలదూర్ గ్రామం, ఎడవల్లి గ్రామం, కౌతాళం మండలంలోని కరణి గ్రామం, తిప్పలదొడ్డి గ్రామాలలో సదస్సు నిర్వహిస్తామన్నారు. కర్నూలు డివిజన్‌లోని ఓర్వకల్లు మండలంలోని హుస్సేనాపురం గ్రామం, గూడూరు మండలంలోని గూడూరు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పత్తికొండ డివిజన్లోని దేవనకొండ మండలం తర్నేకల్లు గ్రామం, వెల్మకూరు గ్రామం, లలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని అన్నారు

201 రేషన్‌షాపుల డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో 201 రేషన్ షాపుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఖాళీగా ఉన్న 118 రేషన్ షాపులతో పాటు కొత్తగా 83 షాపులో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. సోమవారం కర్నూలు పత్తికొండ , ఆదోని డివిజన్ పరిధిలో ఉన్నటువంటి ఆర్‌డిఒలు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు.

కలెక్టరేట్లో నేడు గ్రీవెన్స్ : కలెక్టరేట్‌లో ప్రజా సమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రేషన్ షాపులకు నోటిఫికేషన్

30 లోపు దరఖాస్తుకు గడువు-జనవరి 5న పరీక్ష

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ డివిజన్ పరిధిలో హేతుబద్ధీకరణ ద్వారా నూతనంగా ఏర్పడిన చౌకధారణ దుకాణాలకు వివిధ రకాల కారణములతో ఖాళీ ఏర్పడిన వాటికి శాశ్వత ప్రాతిపదికన డీలర్లను నియమించుటకు నోటిఫికేషన్ విడుదల చేశామని పత్తికొండ ఆర్‌డిఒ డాక్టర్ ఎస్ భరత్ నాయక్ పేర్కొన్నారు .ఆదివారం నోటిఫికేషన్ వివరాలు వెల్లడించారు. ఈనెల 23నుంచి నోటిఫికేషన్ అమల్లోకి వస్తుందని తెలిపారు. డీలర్ల ఎంపిక రాత పరీక్ష , ఇంటర్వ్యూ ద్వారా జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పొందు పరచిన నిబంధనలకు లోబడి తమ అర్జీలను ఆర్‌డిఒ కార్యాలయము, మండల తమశీల్దార్ కార్యాలయం వారికి నేరుగా కాని, రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాని ఈనెల 30న 5 గంటల లోపు అందజేయాలన్నారు. అర్జీ నమూనా కావలసిన వారు సంబంధిత ఆర్‌డిఒ, తహశీల్దారు కార్యాలయంలో కార్యాలయ పనివేళల్లో పొందవచ్చన్నారు. 2025 జనవరి 5న అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు నోటిఫికేషను సంబంధిత మండల కార్యాలయంలో చూడాలన్నారు. మండలాల వారిగా ఖాళీ ల వివరాలు పత్తికొండ 12, ఆలూరు 13, ఆస్పరి 3, దేవనకొండ 4, హాలహర్వి 5, క్రిష్ణగిరి 2, మద్దికేర 2, తుగ్గలి 4 మొత్తం 45 డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

వాల్మీకి గర్జన -1 సభలో బివిఎస్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-తుగ్గలి

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చి రిజర్వేషన్ కల్పించాలని బోయవాల్మీకి సమితి(బివిఎస్) వాల్మీకి గర్జన-1 సభలో నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం తుగ్గలి మండలం మారెళ్ల గ్రామంలో బివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మారెళ్ళ అంజి అధ్యక్షతన వాల్మీకి గర్జన-1 సభ నిర్వహించారు. మారెళ్ళ అంజి మాట్లాడుతూ బోయ వాల్మీకులకు1956 కన్న ముందు ఉన్న ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కోసం బహిరంగ సభ నిర్వహించామన్నారు. వాల్మీకుల చిరకాల ఆకాంక్ష అయినా వాల్మీకుల ఎస్‌టి రిజర్వేషన్ పునరుద్ధరణ చేయాలని కోరారు. ఈ బహిరంగ సభ పార్టీలకు అతీతంగా వాల్మీకులు అందరూ కలిసికట్టుగా వచ్చారన్నారు. ఏ పార్టీలకు తలవంచకుండా బోయ వాల్మీకి ఎస్టీ రిజర్వేషన్ కోసం పోరాడుతామని అన్నారు. గుడిసె కృష్ణమ్మ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యురాలు మాట్లాడుతూ గతంలో అనేక వాల్మీకి సంఘాల పెద్దలు పోరాటం చేసిన ఫలితంగా 2017లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ బిల్లును క్యాబినెట్ ఆమోదం తెలిపి అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపారన్నారు. తదుపరి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఎస్టీ రిజర్వేషన్ బిల్లును నాలుగు జిల్లాలకే పరిమితం చేసి కేంద్రానికి పంపారన్నారు. ప్రస్తుతం వాల్మీకి రిజర్వేషన్ బిల్లు కేంద్రంలో పెండింగ్‌లో ఉన్నందున కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నారు. అందుకు వాల్మీకులంతా ఏకమై ఈ మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలంటే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో చట్టబద్ధంగా కల్పించాలని బివిఎస్ రాయలసీమజోన్ అధ్యక్షులు రాంభీం నాయుడు అన్నారు. సభలో పాల్గొన్న ముఖ్య అతిథులు, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యురాలు కప్పట్రాళ్ల బుజ్జమ్మ , మహర్షి మీడియా గ్రూప్ కర్నూలు ఎండి చీఫ్ ఎడిటర్ తలారి మద్దిలేటి, తిరుపాల్ నాయుడు, కసాపురం దేవస్థాన వ్యవస్థాకులు తలారి పరుశురాముడు, వివిఎస్ సంఘం రాష్ట్ర గౌర అధ్యక్షులు తలారి మద్దిలేటి , వాల్మీకి సంఘం డైరెక్టర్ హోల్సేల్ రామకృష్ణ దేవనకొండ మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, దేవర్ ఇంటి వెంకటరాముడు వాల్మీకి సంఘ జిల్లా నాయకులు రాంపల్లి తిరుపాల్ నాయుడు, శ్రీనివాసులు మహేంద్రనాయుడు, వివి నాయుడు సోమన్న నాయుడు, సూరన్న నాయుడు, మీసేవ రాముడు బిబిఎస్ మీడియా గ్రూప్ రాష్ట్ర నాయకులు ముని నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి గర్జన-1 సభలో మాట్లాడుతున్న విబిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మారెళ్ల అంజి

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మల్లికార్జునరెడ్డి

నిత్యసాధనతో కబడ్డీలో రాణించాలి

మల్లికార్జున రెడ్డి కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

నిత్యమూ సాధన చేసి కబడ్డీలో రాణించాలని కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి అన్నారు. కర్నూలు డిఎస్ఎ అవుట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక పోటీలను మల్లికార్జున రెడ్డి, క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు ప్రతిరోజు సాధన చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని క్రీడాకారులు ఆరోగ్యంగా క్రమశిక్షణతో దేశ రక్షణకు శ్రేయస్సు కోసం రేపటి పౌరులుగా తయారు కావాలన్నారు. క్రీడాకారులు కబడ్డీ ఆటతో విద్య ఉద్యోగాలలో ముందుకెళ్తారని తెలిపారు. జిల్లా క్రీడల ఇన్‌ఛార్జి అధికారి భూపతిరావు మాట్లాడుతూ క్రీడల వలన విద్య ఉద్యోగాలలో రాష్ట్ర ప్రభుత్వం మూడు శాతం కోటాను ప్రకటించిందన్నారు. కబడ్డీ క్రీడ ఆడడం వలన ధైర్య సాహసాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా కబడ్డీ మాజీ కార్యదర్శి రాజశేఖర్ ,కర్నూలు జిల్లా కబడ్డి కార్యదర్శి శుభాకర్, కోశాధికారి సురేష్, జాయింట్ సెక్రెటరీ అమర్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు విజయ్, గోవింద్, నాగన్న, నాగరాజు, రాగన్న, సుబ్బయ్య, శీలన్న, క్రీడా అభిమాని పితాంబరెడ్డి పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం పూర్తయ్యేనా..?

- రాకపోకలకు తీవ్ర ఆటంకం

ఆగిపోయిన వంతెన నిర్మాణం

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

కర్నూలు జిల్లా కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో నిర్మించ తలపెట్టిన వంతెన నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. జగన్ సీఎం అయిన మూడేళ్లకు ఈ వంతెన నిర్మాణ పనులను నాటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.24 కోట్లను మంజూరు చేసింది. నిర్మాణ పనులను ఒఎంఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు అప్పగించింది. హంద్రీ నదిలో మొత్తం 19 కాంక్రీట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. చివరకు 40శాతం పనులు పూర్తిగా కాకుండానే వంతెన నిర్మాణం బిల్లులు పెండింగులో ఉండడంతో మధ్యలోనే నిలిచిపోయింది. ఈ నిర్మాణం ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతం నుంచి కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి అయినా ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. బ్రిడ్జి నిర్మాణం అవలేదని అందరూ ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడం తర్వాత మర్చిపోవడం అలా దశాబ్దాల పాటు జరుగుతూనే ఉన్నదని, ఆయా గ్రామాల ప్రజలు గోడును వెల్లబోసు కుంటున్నారు.

20 గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది: వంతెన పూర్తయితే ఎర్రగుడి, రామకృష్ణాపురం, ఎర్రబాడు, కొత్తపల్లె, మన్నెగుంట, క్రిష్ణగిరి, వెళ్లేందుకు తక్కువ సమయంలో చేరుకోవచ్చు. ఈ వంతెన నిర్మాణం పనులు పూర్తి చేయకపోవడంతో సుమారు 20 గ్రాముల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వర్షం కురిసినప్పుడల్లా: భారీ వర్షం కురిసి నప్పుడల్లా హంద్రీ నదిలో నీరు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుంది. అవతలి వైపు వెళ్ళాలంటే 20 కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాలి. వంతెన లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉన్నా వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు, అత్యవసర పరిస్థితులలో 108 వెళ్లే సౌకర్యం లేదని, హై స్కూల్ విద్యార్థులు స్కూలుకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక వాహనం వచ్చే పరిస్థితి కూడా లేదని రైతులు పండించిన ఉత్పత్తులను రవాణా చేసుకునే సౌకర్యం లేదని ఆయా గ్రామాల ప్రజల గోడును పట్టించుకుని త్వరగా వదల నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. వంతెన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి ప్రభుత్వం స్పందించాలి: టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచిపోయింది. ఇకనైనా టిడిపి ప్రభుత్వం దృష్టి సారించాలి దశాబ్దాల తరబడి ఎదుర్కొంటున్న తమ సమస్యను పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల కోరుతున్నారు.

మన్నెగుంట గ్రామ విద్యార్థులు : గోరంట్ల హైస్కూల్లో చదువుతున్నాం. వర్షాకాలం వచ్చిందంటే బిక్కు బిక్కు మంటూ హంద్రీ నదిని దాటాల్సి వస్తుంది. హంద్రీ ఉధృతంగా ప్రవహిస్తే స్కూలుకు వెళ్లడం మానేస్తాం.

వంతెనను త్వరగా పూర్తి చేయాలి

మా పొలాలు హంద్రీ అవతల వైపు ఉన్నాయి. రైతులు పండించిన ఉత్పత్తులను తీసుకురావడం కష్టంగా ఉంది.పాలకులు, అధికారులు చర్యలు తీసుకొని వంతెనను త్వరగా పూర్తి చేయాలి.

- షరీఫ్ గోరంట్ల గ్రామ నివాసి.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థులు చదువుతోపాటు క్రీడ పోటీల్లో రాణిస్తూ ప్రతిభ కనబరచాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. ఆదివారం సైన్స్ కళాశాల మైదానంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో న్యూ జనరేషన్ ఆక్టివిటీస్ 2024-25 యాన్యువల్ జోనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎమ్మెల్యే పార్థసారథి, రోటరీ క్లబ్ మాజీ డిస్టిక్ గవర్నర్ చిన్నపరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ దశరథ రామిరెడ్డి, అధ్యక్షుడు సందీప్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ సునీల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. పోటీలు ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే పార్థసారథి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, యూత్ ఆఫీసర్ సాబిర్ అహ్మద్ కాగడ ను చేత పట్టుకుని గ్రౌండ్లో తిరిగి ఆటల పోటీలను ప్రారంభించారు. ఆటల పోటీల్లో 40 స్కూళ్ల నుండి దాదాపు 1500 మంది పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న నైతున్యాన్ని వెలుగు తీసేందుకు క్రీడ పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయం అన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు మానసికంగా చాలా దఢంగా ఉంటారని కొనియాడారు. క్రీడాకారుల కోసం ఆదోనిలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఫుట్బాల్, త్రో బాల్, కబడ్డీ, డాడ్జ్ బాల్, బాస్కెట్బాల్, అథ్లెటిక్స్, కోకో, టెన్నికాయిట్ ఆటల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు కప్పులతోపాటు సర్టిఫికెట్ అందజేశారు. క్రీడా పోటీలు సజావుగా సాగేందుకు 60 మంది వ్యాయామ ఉపాధ్యాయుల సహకారం యనలేనిదని ఘనంగా సన్మానించారు. క్రీడా పోటీలు పాల్గొనందుకు వచ్చిన విద్యార్థి విద్యార్థులకు భోజన వసతిని కల్పించారు.కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు యూత్ ఆఫీసర్ రాజేష్ జైన్, సభ్యులు శ్రీధర్ రెడ్డి, భరత్ షా, ప్రశాంత్ గాంధీ, సుబ్బయ్య, బసవరాజు, వీరేష్ స్వామి, పద్మనాభయ్య శెట్టి, శేషయ్య, నితిన్, శివరాం, హుస్సేన్ బాషా, ఫిజికల్ డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాజ్యోతిని వెలిగించిన ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఘనంగా జాతీయ గణితదినోత్సవం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలతో నివాళులు అర్పించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్, గ్రంథాలయ శాస్త్రం అధ్యాపకులు ఎం గోవిందరాజులు, జంతు శాస్త్రము అధ్యాపకులు జిబి వేదవతి మాట్లాడారు. ప్రాచీన గణిత శాస్త్రవేత్తలను, ఆధునిక గణిత శాస్త్రవేత్తలను గురించి తెలియజేశారు. శ్రీనివాస రామానుజన్ ఆయన జన్మదినం, ఆయన ప్రాథమిక విద్య అభ్యాసము తెలియజేశారు. శ్రీనివాస రామానుజన్ గణిత విశ్లేషణ, సంఖ్యాశాస్త్రము, అనంత శ్రేణులు, అవిరామ భిన్నాలు లాంటి గణిత విభాగాలలో విశేషమైన కృషి చేశారన్నారు. ఆయన కనుగొన్న సూత్రాలు అపూర్వమైనవన్నారు. నిరంతర శ్రమ చేసి గణితంలో 32 పరిశోధన పత్రాలను సమర్పించారన్నారు. 2012 నుండి రామానుజన్ జయంతిని జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నామని ప్రపంచ గణితి మేధావులలో శ్రీనివాస రామానుజన్ ఒకరు అని తెలిపారు. 3900 గణిత ఫలితాలను రాబటారని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గణిత శాస్త్రం అధ్యాపకులు శివయ్య, అధ్యాపకులు బాబు, శ్రీనివాసులు, బడే సాబు, శాంతి స్వరూప్, రంగన్న, సూరిబాబు, ఈరన్న, కాంతమ్మ, రాజేశ్వరి, ప్రభావతి, సిసిడిఓ సోఫియా బేగం, ఆఫీస్ సిబ్బంది శ్రీనివాసులు, సాదిక్ బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎం.గోవిందరాజులు

మిరప సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

- ఉద్యాన శాఖ అధికారి హరేంద్ర

ప్రజాశక్తి-ఆదోని రూరల్

ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో మిరప పంటలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారి హరేంద్ర తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రస్తుత అల్పపీడన ప్రభావంతో గాలిలో తేమశాత పెరగడం, వేడి, మంచు, మేఘావృతమైన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మిరప పంటలో చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున రైతులు మిరప పంటలో వచ్చే చీడపీడలను నివారించడానికి సస్యరక్షణ చేపట్టాలని తెలిపారు. తామర పురుగుల ఉధృతి అధికం కాకుండా పొలంలో బెట్ట పరిస్థితులు లేకుండా నీటి తడులు ఇవ్వాలని, పొలంలో ఎకరాకు 40-50 చొప్పున నీలి, పసుపు రంగు జిగురు అట్టలు పెట్టుకోవాలని సూచించారు. వేప సంబంధిత మందులు అనగా పిచికారీ చేయాలన్నారు. నల్లి నివారణకు మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. మిరప తెగుళ్ల నివారణకు పొలంలో గాలి ప్రసారణ ఉండేటట్లు చూసుకోవాలని, అధిక తేమ లేకుండా చూసుకోవాలని తెలిపారు. పొలంలో అంత్రాక్నోస్ మచ్చ, బూడిద తెగులు గమనించినట్లయితే వెంటనే మందులు పిచికారీ చేసుకోవాలన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి హరేంద్ర

సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

తుంగభద్ర ప్రాజెక్ట్ చైర్మన్ టిప్పు సుల్తాన్

ప్రజాశక్తి-కౌతాళం

తుంగభద్ర దిగువ కాలువ ప్రాజెక్టు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రాజెక్టు చైర్మన్ టిప్పుసుల్తాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బిసి సామాజిక వర్గానికి చెందిన తన కుటుంబానికి పార్టీ గుర్తించిందని అన్నారు. పార్టీ కోసం 40 యేళ్లుగా కష్టపడిన పనిచేశానన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు తన తండ్రి చందాఖాన్ మండల అధ్యక్షులుగా ఎన్నికై సేవలు అందించారన్నారు. అప్పటినుండి రైతుల కోసం సాగునీటి విషయంలో చందా ఖాన్‌తో పాటు, ఎల్ఎల్‌సి పరిరక్షణ కమిటీ సభ్యులకు పనిచేసిన సాయిబాబా తోపాటు ఎన్నో పోరాటాలు చేశామన్నారు. పార్టీ కోసం విధేయులుగా పనిచేసిన కష్టానికి ప్రాజెక్ట్ చైర్మన్ పదవి పార్టీ కట్టబెట్టిందని పేర్కొన్నారు. తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి పనిచేసి రైతులందరికీ సాగునీరు అందేలా కృషి చేస్తామన్నారు. ప్రతి ఎకరాకు ప్రతి రైతుకు సాగునీరు అందించడమే తన లక్ష్యమన్నారు. ఈ పదవి రావడానికి కృషి చేసిన కర్నూలు జిల్లాలోని అధ్యక్షులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అన్ని నియోజకవర్గాల నాయకులు వివిధ మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని మండల అధ్యక్షుడు ఉల్లిగయ్య, ఉరుకుంద ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ శివ మోహన్ రెడ్డి, టిడిపి రైతు సంఘం రాష్ట్ర జిల్లా కార్యదర్శులు అడివప్ప గౌడ్, వెంకటపతి రాజులకు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

తుంగభద్ర ప్రాజెక్ట్ చైర్మన్ టిప్పు సుల్తాన్‌కు పూలమాల, శాలువాతో సన్మానం

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రమాదాలు జరిగితే తప్ప ఏ సంబంధిత అధికారులైన అప్పటికప్పుడు ఆ సమస్యను పరిష్కరించి అక్కడికే వదిలేస్తారు. మళ్లీ ఉత్పన్నం కాకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని చెబుతున్నా తరువాత ఏ అధికారి కూడా పట్టించుకోరని మండల ప్రజలు వాపోతున్నారు. బంటనహాల్ గ్రామంలో ప్రధాన వీధిలో ఉన్న పోతప్ప కట్ట దగ్గరకు ఆనుకొని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దాని వల్ల పలుసార్లు ప్రమాదం నుంచి బయటపడ్డామని ఆ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. పిల్లలు, పెద్దలు ఎక్కువ నీడనిచ్చే కట్ట కావడంతో సమయం దొరికినప్పుడల్లా అక్కడనే కూర్చోవడం, విశ్రాంతి తీసుకోవడం జరుగుతుందని అటు వంటి సమయంలో కరెంటు వైర్లకు అగ్గి రవ్వలు రాలుతున్నాయని ఆ గ్రామ ప్రజలు తెలుపు తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ట్రాక్టర్లు గాని, విద్యార్థులు తోలుకొని పోయే బస్సు కట్ట దగ్గర తిప్పు కునేటప్పుడు ఎక్కడ తగులు తుందోనని భయం భయంగా వెళ తున్నారు. ట్రాన్స్కో అధికారులు స్పందించి సురక్షితమైన ప్రాంతాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. నేమకల్లులో ప్రజలు రద్దీగా ఉన్న ప్రధాన వీధిలో ఉన్న హోటల్ దగ్గర్లోనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ముళ్లకంచె వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎక్కువ రోజులు వర్షాలు పడినప్పుడు ఇనుప స్తంభాలకు కరెంటు పాస్ అయ్యి ప్రమాదాలకు గురిచేస్తున్నాయని, వాటి స్థానంలో సిమెంటు స్తంభాలను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో కరెంటు విషయంలో ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా రద్దీ ఉన్న ప్రాంతాలలో ముఖ్యంగా పాఠశాలలు ఉన్న దగ్గర ట్రాన్స్‌ఫార్మర్లకు ముళ్లకంచలు ఏర్పాటు చేయించాలని ట్రాన్స్కో అధికారులకు ప్రజలు కోరుతున్నారు.

ముళ్లకంచ ఏర్పాటు చేయండి

- హోటల్ నరసింహులు. నేమకల్లు గ్రామం.

హోటల్ పక్కనే కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో అపాయం పొంచి ఉంది. దయచేసి ట్రాన్స్కో అధికారులు స్పందించాలి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్లకంచ ఏర్పాటు చేయించాలి.

నేమకల్లులో రద్దీగా ఉన్న బజార్లో ముళ్లకంచ లేని ట్రాన్స్‌ఫార్మర్

బంటనహాల్ గ్రామంలో రచ్చ కట్టకు దగ్గర్లోనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

సురక్షిత నీరు తాగి ఆరోగ్యంగా ఉండాలి

ప్రజాశక్తి-మంత్రాలయం

గ్రామ ప్రజలు సురక్షిత నీరు తాగి ఆరోగ్యంగా ఉండాలని కమ్యూనిటీ డెవలప్ మెంట్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ జూపల్లి పురుషోత్తంరావు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ కలుషిత నీరు తాగి అనారోగ్య పాలు కాకుండా శు ద్ధి చేసిన సురక్షితమైన నీరు తాగి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. అందరూ తమ చుట్టూ వున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎక్కడ కూడా నీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలని అప్పుడే ఆరోగ్య పరంగా వుంటారని తెలిపారు. అందరికీ 24 గంటలు ఈ ఫిల్టర్ దగ్గర నీళ్ళు అందుబాటులో ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రచ్చుమర్రి గ్రామ సిఎస్ఐ సంఘం సంఘ పెద్దలు దేవమని, బోజప్ప, హుస్సేన్, ఏసోబు, కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ కె.శ్రీనివాసరావు ఎగ్జిక్యూటివ్‌లు ముజీబ్ తిరుమలనాయుడు, నరసింహ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జూపల్లి పురుషోత్తమరావు

దాదా పీర్ సాహెబ్ దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ఫాతేహాలు

ఘనంగా సయ్యద్ బురానుద్దీన్ ఉరుసు వేడుకలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలం ఇస్వీ క్రాస్‌లో శ్రీ సయ్యద్ దాదా పీర్ సాహెబ్ దర్గాలో దర్గా పీఠాధిపతి సయ్యద్ షా బాషపీర్ సాహెబ్ ఖాదర్ లింగ్ బంద్ జగద్గురు జాగీర్దార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పార్థసారథి ఆదివారం ప్రత్యేక పాతేహాలు సమర్పించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ షా బాషా పీర్ సాహెబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పీఠాధిపతి బాష పీర్ సాహెబ్ శిష్య బృందంతో పాటు భక్తులు దర్గాలో స్వాగతం పలికారు. ముఖ్యంగా ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్‌లో వెలసిన హజ్రత్ సయ్యద్ బురానుద్దీన్ జానఃఉరుసు వేడుకలు దర్గాలో పీఠాధిపతి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు . ఈ ఉరుసు వేడుకల్లో ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొని దాదా పీర్ సాహెబ్ దర్గాలో ప్రత్యేక పాతేహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి బాషపీర్ సాహెబ్ ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా సన్మానించి, ఆశీర్వాదం చేశారు. ఈ ఉరుసు వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులకు భోజన వసతి కల్పించారు. ఆదోని పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

దళిత మహిళ ఇంటిని ఆక్రమించిన వారిని శిక్షించాలి

దౌలత్ బీ,రసూల్ మియాలను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కల్లూరు మండల పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీ సమీపంలో బాపూజీ నగర్ నగర్‌లో పెంచలమ్మ ఇంటిని ఆక్రమించిన దౌలత్ బి, రసూల్ మియాలను వెంటనే అరెస్టు చేయాలని సమాచార హక్కు పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె. జయన్న డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో సమావేశం నిర్వహించారు. ఎస్ .కె. జయన్న మాట్లాడుతూ కల్లూరు మండల ఎమ్మార్వో కార్యాలయ అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పట్టాలను మారుస్తూ కల్లూరు ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని తెలిపారు. దళిత పెంచలమ్మ ఇంటిని దౌర్జన్యంగా ఆక్రమించిన దౌలత్‌బి, రసూల్ మీయాలను అరెస్ట్ చేసి ఎస్సీ ఎస్టీ కేసును నమోదు చేయాలన్నారు. వారికి సహకరించిన, కల్లూరు ఎమ్మార్వో కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెంచలమ్మ, జయంతి, సంగాలయ పెంచలయ్య, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళా ఐక్యవేదిక కర్నూల్ నగర అధ్యక్షురాలు మీసాల సుమలత పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కె.జయన్న

నీఖాకు హాజరైన సంధ్య విక్రమ్ కుమార్

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

బూడిదపాడు గ్రామానికి చెందిన బాషా కుమారుడి నిఖాకు ఆదివారం కోడుమూరు నియోజకవర్గ వైసిపి నాయకులు సంధ్యావిక్రమ్ కుమార్ హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు.

యువత పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

యువజన హక్కుల కోసం, మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి హక్కుల కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి యువతకు పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీ సమావేశం ఏఐటీయూసీ కార్యాలయంలో రంగస్వామి అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి బి.రాజు, మాజీ ఏఐవైఎఫ్ నాయకులు శేషు కుమార్ యాదవ్ మాట్లాడుతూ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కల్పించకుండా మతం పేరుతో రాజకీయాలు చేస్తూ యువతను తప్పుదారిలో పయనించేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి కల్పించకపోగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసే పనిలో ప్రభుత్వాలు ఉన్నాయని, ప్రభుత్వరంగ సంస్థలను మొత్తం ఆదాని, అంబానిలకు అప్పచెప్పి వారికీ ఊడిగం చేస్తున్నారని వాపోయారు. అదేవిధంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్న డిఎస్సిపై పూర్తిగా నిర్ణయం తీసుకోకపోవడంతో నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారని, గ్రూప్ 1,2, పోలీస్ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల నాయకులు అల్తాఫ్, వీరంజి, శ్రీకాంత్, సంజీవ్, మునిస్వామి, వీరేంద్ర, సిద్దు, మల్లి తదితరులు పాల్గొన్నారు.

ఎఐవైఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక

సమావేశం అనంతరం ఏఐవైఎఫ్ మండలం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరాములు గౌడ్ తెలిపారు. మండల అధ్యక్షులుగా సిద్దు, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా అల్తాఫ్, కిషోర్, వీరాంజనేయులు, కిరణ్, సహాయ కార్యదర్శులుగా మల్లి, మునిస్వామి, పులి, ఈశ్వరప్ప, కోశాధికారిగా రంగస్వామి లతో పాటు కార్యవర్గ సభ్యులుగా 18 మంది, సమితి సభ్యులుగా 31మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మద్యం అక్రమ రవాణా తగ్గింది

ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు

ప్రజాశక్తి -మంత్రాలయం

పొరుగు రాష్ట్రాల నుండి అక్రమ మద్యం రవాణా తగ్గిందని ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని మాధవరం గ్రామ సమీపంలో ఉన్న సరిహద్దు ప్రాంతంలో ఉన్న చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుండి తక్కువ ధరకే నాణ్యత గల మద్యాన్ని అందుబాటులో తెచ్చిన నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మద్యం రవాణా ఆగిపోయిందన్నారు. చెక్ పోస్టు రికార్డులను, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు.

సిసి కెమెరాలను జిల్లా, రాష్ట్ర కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామని చెప్పారు. రూ.99 మద్యం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమములో ఎమ్మిగనూరు ఎక్సైజ్ ఎస్ఐ ఇస్మాయిల్, బి ఎంపిపి సిఐ మోహిద్దీన్ బాష చెక్ పోస్టు సిఐ చంద్రశేఖర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు

అమిత్ షా క్షమాపణలు చెప్పాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిసిసి అధ్యక్షులు పి.మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మురళీకృష్ణ మాట్లాడుతూ రాజ్యసభలో చర్చ జరిగేటప్పుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా మాటలు అర్థరహితమన్నారు. అంబేద్కర్ లేకపోతే అయన కు మంత్రి పదవి దక్కేదా అని ప్రశ్నించారు. అమిత్‌షా వెంటనే మంత్రి పదవికి, పార్టీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం బాబాసాహెబ్ అంబేద్కర్ సమ్మాన్ మార్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక రాజ విహార్ సెంటర్‌లో అంబేద్కర్ భవన్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీగా బయలుదేరి అక్కడ కలెక్టర్ కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, కాంగ్రెస్ నాయకులు కె.సత్యనారాయణ గుప్త, ఎస్ ప్రమీల, అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సుంకన్న, బి సుబ్రహ్మణ్యం, కోసిగి కె జిలాని తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.1.20 లక్షల ఆట వస్తువులు విరాళం

ప్రజాశక్తి-మంత్రాలయం

మంత్రాలయ శ్రీ రాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీ పరిమళ విద్యానికేతన్ పాఠశాలకు రూ.1.20 లక్షల విలువ గల ఆట వస్తువులను శ్రీ మఠం శిష్యులు సుబ్బ నరసింహులు అందజేశారు. శ్రీ మఠం పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు పరిమళ విద్యానికేతన్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆటలు ఆడేందుకు వస్తువులు లేకపోవడంతో పీఠాధిపతుల ఆదేశాలతో స్పందించిన ఆయన ఆదివారం పాఠశాలకు చేరుకుని ఆట వస్తువులు అందజేశారు. పీఠాధిపతులు ఆయనకు శేషవస్త్రం ఫల మంత్రాక్షతలు జ్ఞాపకను అందజేసి ఆశీర్వదించారు. పాఠశాల కరస్పాండెంట్ సురేష్ కోణాపుర్ ఇతర సిబ్బంది ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

సిపిఎం ఆధ్వర్యంలో చీరలు పంపిణీ

ప్రజాశక్తి-కౌతాళం

క్రిస్మస్ పండగ సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో మహిళలకు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య మాట్లాడుతూ రైతు సంఘం మాజీ అధ్యక్షులు బి. వెంకటేశు లు సహకారంతో 25 మహిళలకు చీరలు పంపిణీ చేశామన్నారు. క్రిస్మస్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

తాగునీటి కొరత రానివ్వొద్దు

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. ఆదివారం బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించి నీటి నిలువ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని మండలం బసాపురం - 104 గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న వి.కొండాపురం చెరువు తనిఖీ చేసి అక్కడ పరిస్థితులను అధ్యయనం చేశామన్నారు. పంప్‌హౌస్‌లో తాగు నీటి సంబంధించిన పనులను పర్యవేక్షించి అధికారులకు సూచన సలహాలు ఇచ్చామన్నారు. బసాపురం -104 గ్రామానికి సంబంధించి తాగునీటి పిడబ్ల్యుఎస్ స్కీంను పరిశీలించి కాలువ నీటితో నింపాలని సూచించామన్నారు. మున్సిపల్ ఇంజనీర్ ఇంతియాజ్ అలీ, డిఇఇ గోపీనాథ్, డ్వామా ఎపిడి లోకేశ్వర, ఆర్డబ్ల్యుఎస్ ఎఇఇ మధుకృష్ణ ఆచారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాసీం వున్నారు.

రేషన్ షాపులకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని డివిజన్ పరిధిలో హేతుబద్ధీకరణ ద్వారా నూతనముగా ఏర్పడిన చౌకధర దుకాణములకు, వివిధ రకముల కారణములతో ఖాళీ ఏర్పడిన చౌకధరల దుకాణములకు శాశ్వత ప్రాతిపదికన డీలర్లను నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. ఆదివారం నోటిఫికేషన్ వివరాలు వెల్లడించారు. సదరు డీలర్ల ఎంపికకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పొందు పరచిన నిబంధనలకు లోబడి తమ అర్జీలను సబ్ కలెక్టర్ కార్యాలయము, ఆదోనివారికి నేరుగా కాని, రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాని 30వ తేదీ సాయంత్రం 05గంటల లోపు అందచేయవలెనని తెలిపారు. అర్జీ నమూనా కావలసిన వారు సంబంధిత మండల తహశీల్దారు కార్యాలయములో కానీ, సబ్ కలెక్టర్ కార్యాలయము, ఆదోని వారి కార్యాలయములో కాని కార్యాలయ పనివేళలో పొందవచ్చన్నారు. జనవరి 5న రాత పరీక్ష ఉంటుందన్నారు. మండలాల వారిగా ఆదోని అర్బన్‌లో 19, ఆదోని రూరల్‌లో, 13 గోనెగండ్లలో 3, కోసిగిలో 10, కౌతాళంలో 4, మంత్రాలయంలో 12, నందవరంలో 2, పెద్ద కడుబురులో 9, ఎమ్మిగనూరులో 6 చొప్పున 80 రేషన్ షాపులకు డీలర్ల నియామకం జరుగుతుందని తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: KURNOOL
I.A.No.697/2024 in I.A.No. 294/2022 in O.S.No. 49/2022

P. Anasuyamma died rep. by Legal Heirs
1. P. Lakshmi Narayana
2. P. Suresh Kumar
3. P. Ravi Kumar
All are residents of Shop No. 13.
Sri Srinivasa Cloth Market, Kurnool
...Petitioners/Defendants

-Vs-

Imitiaz Baig, S/o. Anwar Baig,
H.No. 56/40, Khanderi Street, Kurnool
...Respondent/Plaintiff

NOTICE TO THE RESPONDENT/ PLAINTIFF (REVOCKING ATTACHMENT)

I.A.No.695/2024 లో తమ పిటిషనర్స్/రెస్పాండెంట్స్ తమ చెందిన ఇంటిని I.A.No. 294/2022 లో అటాచ్‌మెంట్ బిఫోర్ జడ్జిమెంట్ వేసియున్నారు. కేసు విచారణ సమయంలో పలుమార్లు వాయిదాలకు హాజరు కానందున గౌరవ కోర్టువారు వాది వేసిన వాజ్యంను 07.03.2024 డిస్మిస్ చేసినారు. వాది ఇమిటియాజ్ బేగ్ పొందిన అటాచ్‌మెంట్ బిఫోర్ జడ్జిమెంటును రద్దు చేయమని గౌరవ న్యాయస్థానం లో అర్జీదారులు పిటిషన్ దాఖలు చేసినందున ఇందులో ప్రతివాది అయిన ఇమిటియాజ్ బేగ్‌ను 06.01.2025 నాడు ఉదయం 10.30 గంటలకు న్యాయస్థానము నందు హాజరై ఎవైనా ఆక్షేపణలు వుంటే తెలుపగలరు. లేని యెడల సదరు పిటిషన్ పరోక్షమున విచారించి తీర్మానించడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు ఉత్తర్వుల మేరకు

వాయిదా : 06. 01. 2025

పి. వెంకటేశ్వర్లు,
పిటిషనరు అడ్వకేటు, కర్నూలు.